
క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఊటుకూరులో నేత్రదానం



గంధం శేషమ్మ

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన గంధం శేషమ్మ గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె భర్త సుబ్బారావు కోరిక మేరకు మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో శేషమ్మ నేత్రాలను నెల్లూరు మాడరన్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ నాగేశ్వర రావు ఆమె నేత్రాలను సేకరించారు.

భువనేశ్వరి టీమ్ అత్యుత్సాహం

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కామాక్షితాయి ఆలయంలో నారా భువనేశ్వరి బృందం అత్యుత్సాహం ప్రదర్శించింది. సాధారణంగా కామాక్షితాయి ఆలయం సాయంత్రం వేళ రద్దీగా ఉంటుంది. కాగా గురువారం రాత్రి భువనేశ్వరి అమ్మవారి దర్శనానికి వచ్చారు. దీంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం పాలకవర్గం ఏర్పాట్లు చేసింది. కాగా ఆలయంలో అమ్మవారి దర్శనానికి భువనేశ్వరి వెళ్లగా ఆమె సెక్యూరిటీ బృందం వారు మీడియాపై ఆంక్షలు విధిస్తూ దురుసుగా ప్రవర్తించారు. టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని సైతం భువనేశ్వరి టీమ్ అడ్డుకుంది.

ఖాదర్‌వలీ ఆశీస్సులతో విజయం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : హజరత్ ఖాదర్‌వలీ ఆశీస్సుల వల్లే తాను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అగచాట్లపురంలో ఉన్న హజరత్ ఖాదర్‌వలీ దర్గా గంధ మహోత్సవం సందర్భంగా మంత్రి గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఖాదర్‌వలీ దర్గా సెంటిమెంట్‌గా మారిందని, ఇక్కడకు వస్తే విజయం తథ్యమన్నారు. అగచాట్లపురం వారు వీధి పేరును ఖాదర్‌వలీ వీధిగా మార్చాలని విజ్ఞప్తి చేశారని, వారి కోరిక మేరకు పంచాయతీలో తీర్మానం పెడుతామన్నారు. మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, వార్డు సభ్యుడు మస్తాన్, ఖాదర్ ఉన్నారు.

బేస్‌లైన్ స్టడీపై దృష్టి పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ చెంచులక్ష్మమ్మ

కోవూరు : ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బేస్‌లైన్ స్టడీపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, దీనిపై ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఎంఈఓ–2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. మండల కేంద్రంలోని 10వ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకబడి ఉన్నారని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. ఆమె వెంట సీఆర్పీ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీకి ఇన్వర్టర్ల వితరణ

కోవూరు: కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ నిర్వాహకులు సుమారు రూ.50 వేలు విలువ చేసే ఇన్వర్టర్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు సలావుద్దీన్, వంశీకృష్ణ వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆ సంస్థ చైర్మన్లు గాదిరాజు జీవనకృష్ణ, హరికృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే తాము సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, దీనిని కొనసాగిస్తామని వెల్లడించారు.

ఆస్పత్రికి స్పెషల్ బెడ్లు

సీహెచ్‌సీలోని ఐసీయూకు సంబంధించి స్పెషల్ బెడ్లు గురువారం ఆస్పత్రికి చేరుకున్నాయి. ఇప్పటికే ఈ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది.

ఆసరా వేడుక.. ఊరంతా పండగ



సర్వేపల్లిలో జరిగిన ఆసరా వారోత్సవాలకు భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు



విడవలూరులో జరిగిన ఆసరా వారోత్సవాలకు విశేషంగా తరలివచ్చిన మహిళలు

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ ఊరూ వాడా పండగ వాతావరణంలో జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో పొదుపు మహిళలు తరలివచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారని, ఆయనకు తమ మద్దతు ఉంటుందని మహిళలు వెల్లడిస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• చంద్రబాబును ఎవరూ నమ్మరు

వెంకటాచలం : చాలా సార్లు ప్రజలను మోసం చేసిన చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లిలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు మహిళలు విశేషంగా తరలివచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు రైతులకు, మహిళలకు రుణమాఫీ చేస్తామని నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకుండా చంద్రబాబు వ్యవహరించాడని తెలియజేశారు. చంద్రబాబు చేసిన మోసంతో ఆగ్రహానికి గురైన ప్రజలు 2019 ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజారిటీ సాధించి పెట్టారని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు, రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేస్తుంటే సోమిరెడ్డి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రైతులు, సొంత ఇల్లు లేని నిరుపేదల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతు రథం, నీరు–చెట్టు పథకాల పేరుతో అడ్డగోలుగా దోచుకున్న సోమిరెడ్డి, ఏనాడైనా ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకున్నాడా అని మండిపడ్డారు. వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో కిరాయి కోసం రాజకీయాలు చేసే సోమిరెడ్డిని సర్వేపల్లి ప్రజలు పూర్తిగా మర్చిపోయారని తెలియజేశారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

విడవలూరు: అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. విడవలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత వారోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొని మెగా చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యమైందని వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు నియోజకవర్గంలో మొత్తం 4,546 పొదుపు గ్రూపులకు నాలుగో విడతగా రూ.36.82 కోట్లు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రామిరెడ్డి విజయభానురెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, ఏనేటి ప్రసాద్, తిరుపతయ్య, సౌందర్య, వాసు పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారని, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని వెల్లడించారు.

జాతీయ పోటీలకు మనుబోలు యువకుడు



ముఖేష్‌ను అభినందిస్తున్న ట్రైనర్

మనుబోలు : జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు మనుబోలుకు చెందిన ముఖేష్ ఎంపికయ్యాడు. ఐటీఐ చేసిన ముఖేష్ కుస్తీపై ఆసక్తితో నెల్లూరుకు చెందిన ప్రేమ్ వద్ద శిక్షణ పొందాడు. ఇటీవల ప్రకాశం జిల్లా టంగుటూరులో జరిగిన అండర్–20 రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచాడు. దీంతో జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొనాల్సి ఉందని ముఖేష్ తెలిపాడు. ఎవరైనా స్పాన్సర్‌షిప్ కల్పిస్తే మరింత రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తానని తెలియజేశారు.

కులగణన సర్వే 92 శాతం పూర్తి

మనుబోలు : మండల పరిధిలో కులగణన సర్వే 92 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంకన్నపాళెంలో జరుగుతున్న కులగణన సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శీనయ్య ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

విద్యా సామగ్రి అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని ఖాజానగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహారా సంస్థ వారు విద్యా సామగ్రి అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి యస్దానీబాషా, హెచ్‌ఎం మస్తానయ్య, సీఆర్పీలు మల్లేశ్వర్‌రెడ్డి, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహ విద్యార్థినులకు వైద్యపరీక్షలు

పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో గురువారం బీసీ హాస్టల్ విద్యార్థినులకు డాక్టర్ రిషిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. సంక్షేమాధికారి ద్వారా వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందజేయాలని, కాచి చల్లార్చిన నీటిని తాగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులకు జ్వరాలు వస్తే వెంటనే సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. డాక్టర్ వెంట ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి

ట్రాఫిక్ నియమాలు పాటించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోందని, వాహనదారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రయాణం సజావుగా సాగుతుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బస్సులు నిలిపేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయించిన సీఐ, ఎస్సై

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



కొడవలూరు ఎంపీడీఓ ప్రద్యుమ్న

కొడవలూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వి.ప్రద్యుమ్నకుమార్ కొడవలూరులోని ఆయన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా పర్చూరు ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.సుబ్రహ్మణ్యం టంగుటూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్‌ను ఈఓపీఆర్డీ వి.డేవిడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారుల బదిలీలు జరుగుతుండడం తెల్సిందే.

• కోవూరు: కోవూరు ఎంపీడీఓగా బి.రామాంజనేయులు గురువారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ముజీబ్ పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈయన బాపట్ల జిల్లా జె.పంగులూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీహరి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో టైపిస్ట్ హుమాయున్, సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరు ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

నేడు జొన్నవాడలో వేలంపాటలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి శుక్రవారం పలు వాటికి వేలంపాటలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ గురువారం తెలిపారు. పుష్పాలు, కూరగాయలు, ప్లంబింగ్, విద్యుత్ సామన్లు, పారిశుద్ధ్య సామగ్రి, పూలాభిషేకం, పాలు, పెరుగు, శేషవస్త్రాలు, స్టేషనరీ, అరటి ఆకులు, అరటిచెట్ల సరఫరా, తలనీలాల సేకరణ, ఎరువుల అమ్మకం తదితర వాటిపై వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 నుంచి వేలంపాటలు మొదలవుతాయని తెలిపారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత



విడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరుగురు దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను గురువారం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న ఈ మేరకు వీటిని పంపిణీ చేశారు. అలాగే రామచంద్రాపురం గ్రామానికి చెందిన తరుణ్ ఇటీవల తన తల్లిదండ్రులను కోల్పోయాడు. దీంతో అతనికి ట్రస్ట్ ద్వారా రూ.50,000లు అందించారు. అదే విధంగా దండిగుంటకు చెందిన సరళ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా ఆమెకు రూ.50,000లు అందజేశారు.

బుచ్చిలో కౌన్సిల్ సమావేశం

• పలు అంశాల ఆమోదం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు అంశాలను ప్రవేశపెట్టగా సభ్యులందరూ వాటికి ఆమోదం తెలిపారు. ఎస్‌కే దస్తగిరిని కోఆప్షన్ మెంబర్‌గా ఎన్నుకున్నామని తెలిపారు.

కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోనే పేదలకు న్యాయం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేద, అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రభగిరిపట్నంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.24 లక్షలతో పూర్తి చేసిన సైడ్ డ్రెయిన్లను మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రభగిరిపట్నంలో రూ.5.05 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తంగా సంక్షేమం, అభివృద్ధితో పరిశీలిస్తే ఈ ఒక్క గ్రామానికే రూ.16 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాలు అభివృద్ధి చెందాయని, సీఎం జగన్ వల్లనే ఇది సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో అసైన్మెంట్, పీఓటీలు కలిపి 10 వేల ఎకరాలు పేదలకు పంపిణీ చేసినట్లు వివరించారు. సోమిరెడ్డి కరోనా కష్టకాలంలో ప్రజలకు దూరంగా ఉంటే తాను రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గమంతా పర్యటించి బియ్యం, సరుకులు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల కోసం రూ.22 కోట్లు మంజూరు చేయించినట్లు మంత్రి కాకాణి తెలిపారు. నావూరు రోడ్డుకు రూ.10.83 కోట్లు, నావూరు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు చేశామని, టెండర్ల ప్రక్రియ జరిగిందన్నారు. అనంతరం గ్రామస్తులకు భూ పట్టాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.వీరవసంతరావు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి.పెంచలప్రసాద్, నాయకులు ఎ.ధనంజయనాయుడు, జి.విజయ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా జగనన్న ప్రభుత్వం

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలోని మత్స్యకారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేట వద్ద సర్వేపల్లి రిజర్వాయర్‌లో మీనోత్సవం పథకం ద్వారా 10 లక్షల చేప పిల్లలను మంత్రి కాకాణి చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు వివిధ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చుతున్నారని తెలియజేశారు. అందులో భాగంగానే మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా ప్రధానమైన జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లలను ప్రతి ఏటా విడుదల చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల మత్స్యకారులు ఇతర పనులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, చేపలవేట ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని చెప్పారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎలా మేలు చేయాలో ఆలోచించలేని వ్యక్తులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఫిష్ బజార్లు ఏర్పాటు చేస్తున్నారని అవహేళన చేయడం సిగ్గుచేటన్నారు. ఫిష్ బజార్ల వల్ల ఆయా కుటుంబాలకు జీవనోపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వర రావు, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కొణిదెన విజయభాస్కర్ నాయుడు, డక్కిలి రమణయ్య, ఆరుగుంట జగదీష్‌రెడ్డి, కనుపూరు ధీరజ్‌రెడ్డి, మంచు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న మంత్రి కాకాణి

టీడీపీ భూస్థాపితం ఖాయం

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ భూస్థాపితం ఖాయమైందని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అనికేపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మండల ఏఏబీ చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నెల్లూరులో మంత్రి కాకాణిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కందల దయాకర్, కరుణాకర్, కాకి ఏడుకొండలు, షేక్.నజీర్ తదితరులు ఉన్నారు. వీరికి మంత్రి కాకాణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పాలనలో ప్రజల గురించి సోమిరెడ్డి పట్టించుకోక పోవడంతో ఏళ్ల తరబడి టీడీపీ కార్యకర్తలు విసిగిపోయి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. సోమిరెడ్డికి మతిభ్రమించి టీడీపీలో ఉన్న వారికే కండువాలు కప్పి భారీ చేరికలంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.



మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అనికేపల్లి వాసులు